సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 5 । జనవరి । 2024



మహిళా మార్ట్‌లతో సాధికారత
రాష్ట్రంలో మహిళా సాధికారతకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న కృషికి వైఎస్సార్ చేయూత మహిళ మార్ట్‌లు తార్కాణంగా నిలుస్తున్నాయి. 8లో ▸



వైఎస్సార్ సీపీలో చేరికలు
ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరడంతో ప్రతిపక్ష పార్టీల వారు సైతం వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. 8లో ▸



మద్ది ఆదాయం లెక్కింపు
జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో హుండీ ఆదాయం లెక్కించారు. 55 రోజులకు రూ.47,88,732 లభించింది.

వెలుగులు నింపే ఆసరా

డ్వాక్రా మహిళలకు వరం

- నాల్గో విడత రుణమాఫీకి సన్నాహాలు
- జిల్లాలో బయోమెట్రిక్ ప్రక్రియ పూర్తి
- 2.56 లక్షల మంది లబ్ధిదారులు
- సుమారు రూ.266.50 కోట్ల అందజేత
- ఈ నెలలోనే ఖాతాల్లో జమ



ఆచంట మండలం భీమలాపురంలో డ్వాక్రా గ్రూపు సభ్యుల బయోమెట్రిక్ చేస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): మహిళా సాధికారత, స్వావలంబన లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పథకాలు అమలు చేస్తున్నారు. అన్నింటా అండగా నిలుస్తూ చేయూత అందిస్తున్నారు. గత ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణమాఫీని వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా అమలుచేస్తూ మహిళా పక్షపాతిగా నిలుస్తున్నారు. డ్వాక్రా మహిళలకు ఓ పక్క సున్నావడ్డీకి రుణాలు అందించడంతో పాటు రుణాలను మాఫీ చేసి సంక్షేమానికి పాటుపడుతున్నారు. 2019 ఏప్రిల్ నాటికి డ్వాక్రా సంఘాలకు ఉన్న రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేస్తానని సీఎం జగన్ హామీ ఇచ్చారు. ఇప్పటికే మూడు విడతల రుణ మాఫీ చేయగా నాల్గో విడత రుణమాఫీకి చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లాలో అధికారులు సన్నాహాలు మొదలుపెట్టారు.

కొత్త సంవత్సరం కానుక

వైఎస్సార్ ఆసరా పథకం నాల్గో విడతకు సంబంధించి డ్వాక్రా మహిళల బయోమెట్రిక్ ప్రక్రియను అధికారులు పూర్తిచేశారు. 25,866 గ్రూపులకు చెందిన 2,56,316 మహిళల బయోమెట్రిక్‌ను పూర్తిచేశారు. కొత్త సంవత్సరం కానుకగా ఈ నెలలోనే లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ములు వేయనున్నారు. జిల్లాలో నాల్గో విడతకు సంబంధించి ఒక్కో మహిళ ఖాతాలో రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు మొత్తంగా రూ.266.50 కోట్లు జమచేయనున్నారు.

మూడు విడతల్లో రూ.800 కోట్లకు పైగా..

జిల్లాలో డ్వాక్రా రుణమాఫీకు సంబంధించి ఇప్పటి వరకు మూడు విడతల్లో రూ.800.89 కోట్లను ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసింది.

అంతటా హర్షాతిరేకాలు

మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణ మాఫీ చేయడంపై అంతటా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే మూడు విడతల సాయం అందించారని, ఇప్పుడు నాల్గో విడతకు చర్యలు తీసుకోవడం సంతోషంగా ఉందని చెబుతున్నారు. గతంలో చంద్రబాబు డ్వాక్రా రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి అధికారం చేపట్టిన తర్వాత మోసం చేశారని గుర్తు చేసుకుంటున్నారు. అయితే మహిళలకు ఇచ్చిన హామీలన్నింటినీ పారదర్శకంగా అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందని అంటున్నారు.

జిల్లాలో వైఎస్సార్ ఆసరా అమలు

విడత	గ్రూపుల సంఖ్య	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి రూ.కోట్లలో
మొదటి	25,298	2,52,980	266.74
రెండో	25,312	2,52,120	267.15
మూడో	25,878	2,56,402	267.00
నాల్గో విడత	25,866	2,56,316	266.50

ఇప్పటివరకూ మూడు విడతలు జమ కాగా, ఈ నెలలో నాల్గో విడత నిధులు జమ కానున్నాయి.

రూ.56 వేల లబ్ధి పొందాను



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణమాఫీ హామీ అమలుచేయడంతో ఇప్పటివరకు నాకు మూడు విడతల సాయం అందింది. రూ.18,471 చొప్పున మూడు విడతలకు రూ.56,223 మేర నాకు లబ్ధి చేకూరింది. నాల్గో విడత రుణమాఫీకి బయోమెట్రిక్ పూర్తి చేసి అర్హత పొందాను.

– బర్రె రామలక్ష్మి, లబ్ధిదారురాలు, కొత్తపూసలమర్రు

రూ.266.60 కోట్ల జమ



ఆసరాకు సంబంధించి జిల్లాలో 25,866 గ్రూపులకు చెందిన 2,56,316 మంది సభ్యుల బయోమెట్రిక్ పూర్తి చేశాం. ఈ నెలలోనే రుణమాఫీ లబ్ధి వారి ఖాతాల్లో జమచేయనున్నారు. ఇప్పటికే ప్రభుత్వం మూడు విడతలు అందించింది. ఆఖరి విడతగా జిల్లాలో సుమారు రూ.266.50 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమచేయనున్నారు. ఎక్కడైనా బయోమెట్రిక్ వేయని వారు వెంటనే పూర్తి చేసుకోవాలి.

– ఎస్.శివప్రసాద్‌యాదవ్, డీఆర్‌డీఏ పీడీ, భీమవరం

న్యూస్‌రీల్

కోర్టు ఏర్పాట్ల పరిశీలన



మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి పురుషోత్తం కుమార్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని కోర్టు సముదాయాల ప్రాంగణంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఏడీజే కోర్టును, వివిధ కోర్టులను గురువారం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి సీహెచ్ పురుషోత్తంకుమార్ పరిశీలించారు. ఏడీజే కోర్టు ఏర్పాటుకు సంబంధించిన పనులు, మౌలిక వసతుల ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బార్ అసోసియేషన్ కార్యాలయాన్ని సందర్శించి న్యాయవాదులతో మాట్లాడారు. తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు, జడ్జిలు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.అప్పిరెడ్డి తదితరులు ఆయన వెంట ఉన్నారు.

వీనులవిందుగా వీణా కచేరి



వీణా కచేరి దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం త్యాగరాజ భవనంలో త్యాగరాజ 105వ ఆరాధనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం బెంగళూరు వీణా విద్వాంసురాలు జె.యోగానందం వీణా కచేరి వీనులవిందుగా సాగింది. జగదానందకారక, సరస్వతీ నమోస్తుతే తదితర గీతాలను వీణ, మృదంగ వాయిద్యాలతో ఆలపించారు. సహ వాయిద్యకులుగా రక్షిత రమేష్, మృదంగం లక్ష్మి రాజశేఖర్ (బెంగళూరు), కంజర భాగ్య లక్ష్మణకృష్ణ సహకరించారు. అనంతరం త్యాగరాజ మ్యూజిక్ అకాడమీ అధ్యక్ష కార్యదర్శులు ఉద్దరాజు కాశీ విశ్వనాథ రాజు, కారుమూరి ఆదిత్య, కారుమూరి చిన బాబు, చెరుకువాడ వెంకట్రామయ్య, రంగ సాయి కళాకారులను సత్కరించారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



దివ్యాంగురాలికి ల్యాప్‌టాప్ అందిస్తున్న ఏలూరు జేసీ లావణ్యవేణి

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తుందని, వాటిని విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి అన్నారు. గురువారం బ్రెయిలీ లిపి ప్రదాత లూయిస్ బ్రెయిలీ జయంతిని కలెక్టరేట్ సమీపంలోని గిరిజన భవన్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా జేసీ మాట్లాడుతూ అంధుల ఆరాధ్య దైవం బ్రెయిలీ అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో దృష్టి లోపం గల దివ్యాంగులు సుమారు 250 మంది హాజరయ్యారు. పలువురు దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌లను డీఆర్వో వెంకటేశ్వరరావుతో కలిసి ఆమె అందజేశారు. 15 మంది దివ్యాంగుల సేవలకు గుర్తింపుగా సన్మానం చేసి ప్రశంసా పత్రాలు అందించారు. విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు పి.రాకడ మణి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. వివిధ సంఘాల నాయకులు జీడీవీఎస్ వీరభద్రరావు, గిడియన్, కుందేటి జయరాజ్, పరివర్తన్ పాఠశాల కన్వీనర్ డి.శ్రీనివాస రెడ్డి, జే అండ్ కరుణోదయ స్కూల్ కరస్పాండెంట్ హెన్నీ డొమ్నిక్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలి : ఎస్పీ

ఏలూరు టౌన్: సెక్టార్ పోలీస్ అధికారులు ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని, కేటాయించిన ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి భౌగోళిక స్వరూపాలపై అవగాహన చేసుకోవాలని ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరీప్రశాంతి అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, పోలవరం పోలీస్ సబ్‌డివిజన్ల పరిధిలో సెక్టార్ పోలీస్ అధికారులతో ఆమె గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఆయా సెక్టార్ల పరిధిలో సేకరించిన సమాచారంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలని ఆదేశించారు. సెక్టార్ పోలీస్ అధికారులు ఎన్నికల పోలింగ్ బూత్‌లను పరిశీలించి పోలింగ్ సక్రమంగా నిర్వహించేందుకు వసతులు ఎలా ఉన్నాయనేది నివేదించాలన్నారు.

అంగన్‌వాడీలూ.. సమ్మె విరమించండి

కలెక్టర్ పి. ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో పాటు ఇప్పటికే కొన్నింటికి ఉత్తర్వులు జారీచేసిందని, సమ్మెను విరమించాలని కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న అద్దెలు, కూరగాయల పోపు దినుసులు, కేంద్రాల నిర్వహణ ఖర్చులు, నిర్వహణ చార్జీలను కూడా విడుదల చేసిందన్నారు. పదోన్నతులకు వయోపరిమితి పెంపు, టీఏ, డీఏలు, గరిష్ట వయోపరిమితిని 62 ఏళ్లు, సేవా ముగింపు ప్రయోజనం రూ.10 వేల నుంచి రూ.40 వేలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కేంద్రాల అద్దెలు, నీరు, విద్యుత్ చార్జీలు, చీపుర్లు, ఫినాయిల్ మొదలైన వాటికి నిధులు విడుదల చేసిందన్నారు. 2019 నుంచి అంగన్‌వాడీ వర్కర్ల జీతాలను రూ.11,500కు, మినీ అంగన్‌వాడీ వర్కర్ జీతాలను రూ.7 వేలు, అంగన్‌వాడీ హెల్పర్ల జీతాలను రూ.7 వేలకు ప్రభుత్వం పెంచిందన్నారు. 2013 తర్వాత తొలిసారిగా పదోన్నతులు కల్పించడం, సూపర్‌వైజర్ పోస్టులకు పరీక్షల వయోపరిమితి 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచడం వంటి మేలు చేసిందన్నారు. ఈ ఏడాది నుంచి రూ.2 లక్షల వరకు ప్రమాద బీమా కల్పిస్తోందన్నారు. జాతీయ ఆహార భద్రతా చట్టం ప్రకారం గర్భిణులు, తల్లులు, పిల్లలకు పోషకాహారం అందించడం తప్పనిసరి అని, అంగన్‌వాడీల సమ్మె కారణంగా సక్రమంగా అందడం లేదన్నారు. ప్రజాప్రయోజనాల దృష్ట్యా సేవలను కొనసాగించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామన్నారు. ప్రజల్లో భాగమైన అంగన్‌వాడీలు విషయాన్ని గుర్తుంచుకుని వెంటనే సమ్మె విరమించాలని కలెక్టర్ కోరారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై అప్రమత్తం

కలెక్టర్ ప్రశాంతి



సూచనలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ రవిప్రకాష్

భీమవరం (ప్రకాశంచౌక్): సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, ప్రాంతాలపై అవగాహన, సమన్వయం, అప్రమత్తం అవసరమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో రెవెన్యూ డివిజన్, పోలీస్ అధికారులతో జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్‌తో కలిసి ఆమె సమీక్షించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా, నిర్భయంగా నిర్వహించేలా ముందస్తు చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలను సిద్ధం చేయాలన్నారు. సెక్టోరియల్ అధికారులు, పోలీస్ సెక్టోరియల్ అధికారులను అన్ని విషయాలను సమగ్రంగా పరిశీలించాలన్నారు. గత ఎన్నికల సందర్భంలో నమోదైన కేసులు, సమస్యాత్మక ప్రాంతాలు, ఎన్నికల నిర్వహణలో ఏర్పడిన అడ్డంకులు తదితర అంశాలను పరిగణలోనికి తీసుకోవాలన్నారు. పోలింగ్‌స్టేషన్లకు వెళ్లే మార్గాల మ్యాపింగ్ కీలకమన్నారు. ఎన్నికల నిర్వహణలో ఆటంకం కలిగించే పరిస్థితులు, మద్యం, డబ్బు ప్రభావాలను గుర్తించాలన్నారు. ఈ మేరకు అవసరమైన ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా..

జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు ముందస్తు చర్యలను చేపట్టాలన్నారు. జిల్లాలో ఏ ఒక్క చిన్న సంఘటన కూడా జరగకూడదనే ధ్యేయంతో ఉండాలన్నారు. గత ఎన్నికల సందర్భంగా జరిగిన సంఘటనలు, రౌడీ షీట్లు, పీడీ యాక్ట్‌లు పరిగణనలోకి తీసుకుని నివేదిక సిద్ధం చేసుకోవాలన్నారు. మత, సామాజికపరమైన గొడవలకు ఆస్కారం ఉన్న ప్రాంతాలపై గట్టి నిఘా ఉంచాలన్నారు. జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి, జిల్లా అదనపు ఎస్పీ వి.భీమారావు, సెబ్ ఏఎస్పీ ఏటీవీ రవికుమార్, డీఆర్వో బి.శివన్నారాయణరెడ్డి, ఆర్డీఓలు కె.శ్రీనివాసులురాజు, కె.చెన్నయ్య, ఎం.అచ్యుత అంబరీష్, జిల్లా ఎక్సైజ్ అధికారి ఎల్.రంగారెడ్డి, డీఎస్పీలు బి.శ్రీనాథ్, సి.శరత్ రాజ్‌కుమార్, కె.రవి మనోహర ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై అవగాహన తప్పనిసరి

డీఆర్వో శివన్నారాయణరెడ్డి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్వో

భీమవరం (ప్రకాశంచౌక్): ఎన్నికల సంఘ మార్గదర్శకాలు, ఎన్నికల నిర్వహణపై అవగాహన తప్పనిసరి అని జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణరెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో సాధారణ ఎన్నికలు–2024, ఐటీ అప్లికేషన్స్‌పై ఆర్వోలు, ఈఆర్వోలు, డిప్యూటీ తహసీల్దార్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, నియోజవర్గస్థాయి ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఎన్నికల్లో భాగంగా ఐటీ అప్లికేషన్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల్లో సాంకేతిక పరిజ్ఞానం, మొబైల్ యాప్, వెబ్‌సైట్స్‌పై శిక్షణ ఇచ్చారు. ఎన్‌కోర్, సువిధ, సీవిజిల్, కేవైసీ, ఈవీఎం మేనేజ్‌మెంట్, సాక్ష్యం తదితర యాప్‌లు, వెబ్‌సైట్ల గురించి వివరించారు. నామినేషన్ల ప్రక్రియ నుంచి లెక్కింపు, ఫలితాల వెల్లడి వరకు మొబైల్ యాప్‌లు, వెబ్‌సైట్‌ల పాత్ర కీలకమన్నారు.

మూడు రకాల పరిశీలకులు

ఎన్నికల్లో సాధారణ, వ్యయ, పోలీసు పరిశీలకులు ఉంటారని డీఆర్వో తెలిపారు. వారు పోలింగ్ కేంద్రాల నుంచి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఎన్నికల ప్రక్రియను ఎప్పటికప్పుడు పరిశీలిస్తారన్నారు. శిక్షణ సామగ్రి, పోలింగ్ సామగ్రి, లెక్కింపు సామగ్రి, చేయాల్సిన పనులు, చేయకూడని పనులు, చెక్‌లిస్ట్, హ్యాండ్ బుక్‌ల పంపిణీపై వివరించారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించాలని, పోలింగ్ స్టేషన్లు, రూట్‌మ్యాప్‌పై పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఆర్డీఓలు ఎం.అచ్యుత అంబరీష్, కె.శ్రీనివాసులురాజు, కె.చెన్నయ్య, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ కానాల సంగీత్ మాథుర్, జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల అధికారి కేసీహెచ్ అప్పారావు, డీపీఓ జీవీకే మల్లికార్జునరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా పెద్ద కొడుకుగా సీఎం జగన్



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వృద్ధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి కావాల్సిన సంక్షేమ కార్యక్రమాలను అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటా పెద్ద కొడుకుగా అండగా నిలుస్తున్నారని వృద్ధులు, మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. ఏలూరు 43వ డివిజన్ కొత్తపేటలో కార్పొరేటర్ జనపరెడ్డి కనక రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ నేత జనపరెడ్డి కృష్ణ ఆధ్వర్యంలో గురువారం మహిళలు, వృద్ధులు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ సీఎం జగన్ తమ ఇంట సంక్షేమ పథకాలు అందిస్తూ వెలుగులు నింపుతున్నారన్నారు. కృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చేపట్టిన నవరత్నాలు ఇంటింటా అందుతుండటంతో ఇంతటి ప్రజాదరణ లభిస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు వెల్లంకి రాజు మాట్లాడుతూ ఎవరెన్ని ఇబ్బందులు పెట్టినా పేదలందరికీ మంచి జరగాలనే ఉద్దేశంతో సీఎం జగన్ పథకాలు అమలు చేస్తున్నారన్నారు.

వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి టెండర్లు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరంలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి నాబార్డు నిధులు రూ.28 కోట్లకు సంబంధించి టెండర్ ప్రక్రియ కొనసాగుతుందని డీఈ శ్రీనివాస్ తెలిపారు. టెండర్ ప్రక్రియ ఈనెల 9 వరకు కొనసాగుతుందన్నారు. ఆస్పత్రి భవన శ్లాబ్, ఎర్త్ వర్కులు, ఇతర నిర్మాణాలు చేపడతామన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఇప్పటికే ఆస్పత్రి నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.10 కోట్ల నిధులు మంజూరు చేయించగా అదనంగా నాబార్డు నిధులు మంజూరు చేసిందన్నారు.

పింఛన్.. ఆనందం పెంచెన్

జిల్లావ్యాప్తంగా వైఎస్సార్ పెన్షన్ కానుక ఉత్సవాలు సంబరంలా సాగుతున్నాయి. పెంచిన పింఛన్ మొత్తం రూ.3 వేలను లబ్ధిదారులకు ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జులు అందిస్తున్నారు. సీఎం జగన్ చిత్రపటాలకు లబ్ధిదారులు క్షీరాభిషేకాలు చేస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్



మొగల్తూరు: లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



యలమంచిలి: అడవిపాలెంలో లబ్ధిదారులతో కలిసి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి



పెనుగొండ: ఆచంటలో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు



భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరంలో పెన్షన్ల చెక్కును అందిస్తున్న ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్

వైభవం.. ధనుర్మాసోత్సవం



ఉత్సవమూర్తులకు హారతులిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల క్షేత్రంలో ధనుర్మాసోత్సవాలు శ్రీవారి వైభవాన్ని చాటుతున్నాయి. నిత్యం ఆలయంలో సుప్రభాత సేవకు బదులు తిరుప్పావై పాశురాలను పఠిస్తున్నారు. అలాగే స్వామివారి గ్రామోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం జరిగిన శ్రీవారి తిరువీధి సేవ ఆద్యంతం భక్తులకు నేత్రపర్వమైంది. ఉదయం ఆలయంలో స్వామి, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవమూర్తులను తొళక్క వాహనంపై ఉంచి విశేష పుష్పాలంకారాలు చేశారు. పూజాదికాల అనంతరం స్వామివారి వాహనం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అశ్వ, గజ సేవలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చరణల నడుమ శ్రీవారు క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా ఊరేగారు. అనంతరం స్థానిక ధనుర్మాస మండపంలో స్వామి, అమ్మవార్లు, గోదాదేవికి అర్చకులు విశేష పూజలు జరిపి హారతులిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు.

క్లుప్తంగా

అయోధ్య నుంచి ఆహ్వానం అందడం భేష్



గరికముక్కు సుబ్బయ్యను అభినందిస్తున్న శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

భీమవరం: అయోధ్యలో ఈ నెల 22న జరిగే రామ మందిర ప్రాణప్రతిష్ఠలో పాల్గొనే అవకాశం దక్కడం అభినందనీయమని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతోపాటు అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్ఠలో పాల్గొనే అవకాశం భీమవరం దళిత వర్గానికి చెందిన గరికముక్కు సుబ్బయ్యకు దక్కడం ఆనందంగా ఉందన్నారు. అయోధ్య నుంచి వచ్చిన ఆహ్వాన పత్రిక, అక్షింతలు సుబ్బయ్యకు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో మంతెన రామచంద్రరాజు, పెద్దేటి వెంకట సుబ్బారావు, పెన్నాడ రమేష్, కటారి వేంకటేశ్వరరావు, మజ్జి మహేష్, గొంతిన శ్రీను పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ముసునూరు: మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారంతో దాడులు నిర్వహించి మద్యం అమ్ముతున్న వ్యక్తిని పట్టుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శివనాగేంద్రరావు చెప్పారు. గురువారం సాయంత్రం ముసునూరు గ్రామంలో కంచర్ల ఏసుబాబు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడని తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలసి దాడి చేశామన్నారు. ఈ దాడిలో నిందితుడిని అదుపులోకి తీసుకుని, దారుహౌస్ 180 ఎం.ఎల్ కలిగిన ఐదు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మద్యం, సారా అక్రమంగా విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహిళా మార్ట్‌లతో సాధికారత

- మహిళా సాధికారతకు తార్కాణంగా వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌లు
- 18 వేల మంది స్వయం సహాయక మహిళల భాగస్వామ్యంతో..
- మండల సమాఖ్య ఆధ్వర్యంలో నూజివీడులో ఏర్పాటు
- 6న మార్ట్‌ను ప్రారంభించనున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్



నూజివీడులో ఏర్పాటు చేసిన వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్



మార్ట్‌లో విక్రయానికి సిద్ధం చేసిన వస్తువులు

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో స్వయం సహాయక సంఘాల మహిళలు వ్యాపారవేత్తలుగా ముందడుగు వేస్తున్నారు. మహిళా సాధికారతకు వైఎస్ జగన్ ప్రభుత్వం చేస్తున్న కృషికి వైఎస్సార్ చేయూత మహిళ మార్ట్‌లు తార్కాణంగా నిలుస్తున్నాయి. జిల్లాలో ఇప్పటికే చింతలపూడి, జంగారెడ్డిగూడెంలలో మహిళా మార్ట్‌లు ఏర్పాటై దిగ్విజయంగా నిర్వహిస్తుండగా, ఈ నెల 6వ తేదీన నూజివీడులో మహిళా మార్ట్ ప్రారంభం కానుంది. దీంతో పట్టణ ప్రజలకు సైతం తొలి మహిళా మార్ట్ అందుబాటులోకి రానుంది. మహిళా మార్ట్‌ను ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ప్రారంభించనున్నారు. ఇందుకోసం మండల సమాఖ్య పాలకవర్గ సభ్యులు ఇప్పటికే ఏర్పాట్లు సర్వం సిద్ధం చేసుకున్నారు.

రూ.36 లక్షల మూలధనంతో ఏర్పాటు

నూజివీడులోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్ గేట్ పక్కనే వెయ్యి చదరపు అడుగుల విస్తీర్ణంలోని షాపులో రూ.36 లక్షల మూలధనంతో మండల సమాఖ్య ఆధ్వర్యంలో వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 1800 స్వయం సహాయక సంఘాలు ఉండగా, అందులో 18 వేల మంది సభ్యులు అందరూ కలిసి తలా రూ.200 వాటాతో మార్ట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అద్దె చెల్లించే పనిలేకుండానే మండల సమాఖ్య భవనంలోనే ఈ మార్ట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మార్ట్‌లో వస్తువుల విక్రయాలకు అవసరమైన శిక్షణను సైతం పూర్తిచేసుకున్నారు. 12 మంది బోర్డు ఆఫ్ డైరెక్టర్లను సైతం నియమించుకున్నారు. మహిళల పట్టుదలకు ఈ మహిళా మార్ట్ నిదర్శనంగా నిలుస్తోంది.

అన్ని రకాల వస్తువులు విక్రయాలు

ఈ మహిళా మార్ట్‌లో గృహావసరాలకు అవసరమైన కిరాణాతో పాటు ఆహార పదార్థాలు, పాల ఉత్పత్తులు, హస్తాకళా వస్తువులు, ఫ్యాన్సీ, ఇతర అన్ని వస్తువులను విక్రయించనున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఐటీసీ, ప్రోక్టర్ అండ్ గ్యాంబుల్, రిలయన్స్, డీ మార్ట్, బెస్ట్ ప్రైస్ ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థలతో నేరుగా ఒప్పందాలు చేసుకున్నారు. నాణ్యమైన సరుకులను మార్కెట్‌లో కంటే తక్కువ ధరకు విక్రయించనున్నారు. ఇలాంటి మార్ట్‌ల ద్వారా మహిళలకు సుస్థిర జీవనోపాధి లభించడంతో పాటు మహిళల అభ్యున్నతిలో కీలక భూమిక పోషించనున్నాయి. నాణ్యతకు, నమ్మకానికి మారుపేరుగా ఈ మార్ట్‌లో సరుకులను విక్రయించనున్నారు.

ఒక్కొక్కరు రూ.200 పెట్టుబడితో..



18 వేల మంది స్వయం సహాయక సంఘాల మహిళల భాగస్వామ్యంతో చేయూత మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఒక్కొక్కరు రూ.200 పెట్టుబడితో మొత్తం రూ.36 లక్షలతో ఏర్పాటు చేసుకున్న ఈ మార్ట్‌ను మహిళలే నడుపుతారు. నాణ్యమైన వస్తువులను మార్కెట్‌లో పలికే ధర కంటే తక్కువ ధరకు విక్రయిస్తారు.

– దయాల రాజశేఖర్, ఏపీఎం, నూజివీడు

సమర్థవంతంగా నిర్వహిస్తాం



స్వయం సహాయక సంఘాల సభ్యుల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసుకున్న ఈ మార్ట్ మహిళా సాధికారతకు అద్దం పడుతుంది. దీనిని సమర్థవంతంగా నిర్వహించి లాభాల బాటలో నడుపుతాం. మండలంలోని స్వయం సహాయక సంఘాల మహిళలందరూ ఇక్కడే సరుకులు కొనుగోలు చేసేలా వారిలో చైతన్యం తీసుకువస్తాం.

– కొమారపు నవత, మండల సమాఖ్య అధ్యక్షురాలు, నూజివీడు మండలం

వైఎస్సార్ సీపీ అంటేనే బీసీల పార్టీ

బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్యనారాయణ



కాళ్ల: వైఎస్సార్ సీపీ అంటేనే బీసీల పార్టీ అని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు పెద్దపీట వేశారని ఆ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బాలం సత్యనారాయణ స్పష్టం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న టీడీపీ జయహో బీసీ సభలను ఉద్దేశించి గురువారం అయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ బీసీలకు నాలుగు రాజ్యసభ సభ్యులుగా, మంత్రులుగా, ఎమ్మెల్యేగా బాధ్యతలు ఇచ్చారన్నారు. గ్రామస్థాయి నుంచి రాజ్యసభ వరకు 50 శాతం నామినేటెడ్ పదవులను బీసీలకు ఇచ్చిన ఇచ్చిన సంగతి టీడీపీ నాయకులు తెలుసుకోవాలంటూ అసహనం వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో బీసీలకు 2014 నుంచి 2019 వరకు చేసింది ఏమిటని ప్రశ్నించారు. 139 కులాలు ఉన్న బీసీలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి సీఎం వైఎస్ జగన్ బీసీలను ఆర్థికంగా ఆదుకుంటున్న సంగతి టీడీపీ నేతలకు తెలియడం లేదా అని అడిగారు. వైఎస్సార్ సీపీ అంటేనే బీసీల పార్టీ అని బీసీలంతా నమ్ముతున్నారన్నారు. టీడీపీ నాయకులు జయహో బీసీ సభలు 40 రోజులు కాదు 120 రోజులు నిర్వహించినా రానున్న రోజుల్లో బీసీలంతా సీఎం వైఎస్ జగన్ పక్షాన నిలబడతారన్నారు. రాష్ట్రంలో బీసీలంతా ఒక తాటిపై నిలబడి వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుని సత్తా చాటుతామని సత్యనారాయణ తెలియజేశారు.

కట్నం వేధింపులపై కేసు నమోదు

భీమవరం: అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ ఓ వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై హనుమంతరావు చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భీమవరం వన్‌టౌన్‌కు చెందిన ఎం.గౌరీశాంతి, శివ కోటేశ్వరరావు 2009లో ప్రేమ వివాహం చేసుకున్నామని, అయితే ఇటీవల తన భర్త వేరొక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని తనను శారీరకంగా, అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కారుమూరి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరికలు



కొమ్మరలో మంత్రి కారుమూరి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన స్థానికులు



ఈడూరులో మంత్రి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన మహిళలు

అత్తిలి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరడంతో ప్రతిపక్ష పార్టీల వారు సైతం వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. గురువారం అత్తిలి మండలం కొమ్మర, ఈడూరు గ్రామాల్లో పలువురు మంత్రి కారుమూరి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి మంత్రి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్ వెంట ఉంటే అందరికీ మంచి జరుగుతుందనే నమ్మకం ప్రజలలో కలుగుతోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో ప్రజల కష్టాన్ని దోచేశారని, కానీ నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అవినీతి రహితంగా సంక్షేమ పాలన అందిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఉప సర్పంచ్ మన్యం దానారావు, సొసైటీ అధ్యక్షుడు కునాథరాజు శ్రీహరిరాజు పాల్గొన్నారు.

● గడపగడపకు సంక్షేమం



పోడూరు : కొమ్ముచిక్కాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న వైఎస్సార్ సీపీ పాలకొల్లు ఇన్‌చార్జి గుడాల గోపి

పీడీఎస్ రైస్ స్వాధీనం



అత్తిలిలో వాహనాన్ని సీజ్ చేసిన విజిలెన్స్ అధికారులు

అత్తిలి: అక్రమంగా రవాణా చేస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు గురువారం పట్టివేశారు. అత్తిలి డంపింగ్ యార్డు వద్ద ట్రక్ వాహనంపై రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు విజిలెన్స్, రెవెన్యూ, పౌరసరఫరాలశాఖా అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించి ఇర్రి గౌరీ శంకర్, వాహన డ్రైవర్ కొత్యాల అనిల్‌కుమర్, బాషాలపై నిత్యావసర వస్తువుల చట్టం ప్రకారం కేసు నమోదు చేశామని విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పి.శివరామకృష్ణ చెప్పారు. రూ.40 వేల విలువైన బియ్యం, రూ.1.30 లక్షల విలువ గల వాహనం, రూ.5 వేల విలువైన ఎలక్ట్రానిక్ కాటాను సీజ్ చేశామని చెప్పారు. సీఎస్‌డీటీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సాంకేతికతపై పట్టుతోనే ఉన్నత భవిత



వివరిస్తున్న ఉద్దంటి సందీప్

తాడేపల్లిగూడెం: కష్టపడి చదివిన వారికి తగిన గుర్తింపు, ప్రతిఫలం లభిస్తుందని ఏపీ నిట్ రీసెర్చ్ కన్సల్టెన్సీ డాక్టర్ ఉద్దంటి సందీప్ అన్నారు. నిట్ సందర్శనకు ఏలూరు నుంచి వచ్చిన విద్యార్థులను ఉద్దేశించి ఆయన గురువారం మాట్లాడారు. దేశ ప్రతిష్ఠను అంతర్జాతీయ స్థాయిలో పెంచాల్సిన బాధ్యత యువతరానిదేనన్నారు. లక్ష్యసాధనకు ప్రణాళిక ప్రకారం ముందుకు ముందుకు సాగి గెలుపు తలుపులు తట్టాలన్నారు. సైన్స్, సాంకేతికత, ఇంజనీరింగ్ , గణితం వంటి స్టెమ్ కోర్సులపై దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే కోడింగ్ నేర్చుకుంటే సృజనాత్మకత, తార్కికశక్తి, కంప్యూటర్ నైపుణ్యాలు పెరుగుతాయన్నారు. కళాశాల స్థాయిలోనే సరికొత్త ఆలోచనలు అంకురించి నవకల్పనకు బాటలు వేయాలన్నారు. కృత్రిమ మేధస్సు, మిషన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, రోబోటిక్స్, బిగ్ డేటా ఎనాలటిక్స్ , క్వాంటం కంప్యూటింగ్, త్రీడీ ప్రింటింగ్‌లను నవయుగ వైతాళిక సాంకేతికలుగా పరిగణిస్తారన్నారు. ఈ నూతన సాంకేతికతలపై పట్టు సాధిస్తే ఉన్నత శిఖరాలను చేరుకుంటారన్నారు. నిట్ ఆచార్యులు పి.శంకర్ పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యంపై కేసు నమోదు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యుత్ చౌర్యం చేస్తున్న కోళ్ల ఫారం యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఏలూరు విజిలెన్స్ అండ్ ఏపీటీఎస్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ వి.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలు గ్రామంలోని కోళ్లఫారంలో విద్యుత్ చౌర్యం జరుగుతోందనే సమాచారం మేరకు ఏలూరు డీపీఈ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.చంద్రమౌళి, విజిలెన్స్ హెడ్ కానిస్టేబుల్ కే రాజారమేష్ కుమార్ సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడిలో కోళ్లఫారంలో విద్యుత్ చౌర్యం జరుగుతున్నట్టు గుర్తించి, ఈ మేరకు కోళ్లఫారం యజమానికి రూ.43,999 అపరాధ రుసుముతో పాటు రూ.27 వేలు జరిమానా విధించారని తెలిపారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని రవికుమార్ హెచ్చరించారు.

చురుగ్గా ఓపెన్ ఆడిటోరియం నిర్మాణం

రూ.3.50 కోట్లతో మునిసిపాలిటీ ఆధ్వర్యంలో అభివృద్ధి



నరసాపురంలో నిర్మాణంలో ఉన్న ఓపెన్ ఆడిటోరియం

నరసాపురం: పట్టణంలో మునిసిపాలిటీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఓపెన్ ఆడిటోరియం ఆధునికీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మున్సిపల్ కార్యాలయం పక్కన విశాల స్థలంలో నిరుపయోగంగా ఉన్న మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్ స్థానే అధునాతన వసతులతో ఓపెన్ ఆడిటోరియం నిర్మిస్తున్నారు. రూ 3.50 కోట్లతో చేపట్టిన ఈ పనులు వేగంగా జరుగుతున్నాయి. వచ్చే ఏడాది వేసవి నాటికి ఆడిటోరియం అందుబాటులోకి తెచ్చేలా పనులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్ భారీ విస్తీర్ణంలో విలువైన ప్రాంతంలో ఉన్నా మున్సిపాలిటీకి ఆదాయం కరువైంది. పైగా థియేటర్ నిర్వహణ మునిసిపాలిటీకి భారంగా మారింది. దీంతో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ఆదేశాల మేరకు మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్ స్థానంలో రూ.3.50 కోట్లతో మున్సిపల్ ఓపెన్ ఆడిటోరియం నిర్మాణాన్ని గత ఏడాది ఫిబ్రవరిలో చేపట్టారు.

మునిసిపాలిటీకి గుదిబండగా..

1991వ సంవత్సరంలో రూ.5 లక్షల వ్యయంతో ఓపెన్ ఎయిర్ థియేటర్ భవనాన్ని నిర్మించారు. రెండెకరాల స్థలంలో మునిసిపల్ కార్యాలయం పక్కనే నిర్మించిన ఈ థియేటర్‌లో ఎలాంటి మౌలిక సదుపాయాలు లేకపోవడంతో వివాహాలు, ఇతర ప్రైవేట్ కార్యక్రమాల నిర్వహించుకునేందుకు ఎవరూ ఆసక్తి చూపలేదు. దీంతో థియేటర్ ద్వారా మునిసిపాలిటీకి ఏడాదికి కేవలం రూ.3 వేలు మాత్రమే ఆదాయం వచ్చేది. థియేటర్‌కు నెలనెలా చెల్లించే కరెంటు బిల్లు, వాచ్‌మెన్ జీతం.. ఇలా ఏడాది పొడవునా థియేటర్‌పై వచ్చే ఆదాయం కంటే ఖర్చే ఎక్కువే అయ్యేది. దీంతో మునిసిపాలిటీకి గుదిబండగా మారిన ఈ పాత భవనాన్ని పూర్తిగా పడగొట్టి అధునాతనంగా ఆడిటోరియం భవనం నిర్మాణం చేపట్టారు.

మధ్య తరగతి వర్గాలకు అందుబాటులో ఉండేలా..

పట్టణంలో కల్యాణ మండపాల కొరత తీవ్రంగా ఉంది. దీంతో ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను అభివృద్ధి చేయడంతో పాటు అందుబాటులో ఉన్న విలువైన ఖాళీ స్థలంలో ఓపెన్ ఆడిటోరియం నిర్మించాలని ముదునూరి భావించి ముందడుగు వేశారు. ఓపెన్ ఆడిటోరియం అందుబాటులోకి వస్తే మునిసిపాలిటీకి సంవత్సరానికి రూ.లక్షల్లో ఆదాయం లభించే అవకాశం ఉంది. మధ్య తరగతి ప్రజలకు తక్కువ ఖర్చుతో కార్యక్రమాలు చేసుకునే వెసులుబాటు కలుగుతుంది.

పనులు వేగంగా జరిగేలా ఆదేశాలు ఇచ్చాం



నిరుపయోగంగా ఉన్న మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను రూ 3.50 కోట్లతో అధునాతనంగా నిర్మిస్తున్నాం. కొంతమేర మున్సిపల్ జనరల్ ఫండ్స్‌ను కూడా ఖర్చు చేస్తున్నాం. పనులు వేగంగా జరిగేలా ఆదేశాలు ఇచ్చాం. ఇక నుంచి అన్ని ప్రభుత్వ కార్యక్రమాలు కూడా ఇక్కడే చేసుకునేలా భవన నిర్మాణం చేస్తున్నాం. అనువైన మంచి సెంటర్‌లో, పార్కింగ్‌కు కూడా ఇబ్బంది లేకుండా కొత్త ఓపెన్ ఆడిటోరియం అందుబాటులోకి వస్తుంది.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్, నరసాపురం

క్లుప్తంగా

కాకినాడ వెళ్లి పింఛన్ అందజేత



కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో వృద్ధుడికి పింఛను అందజేస్తున్న వలంటీర్ ప్రీతి

తణుకు అర్బన్: కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తణుకు 15వ వార్డుకు చెందిన పింఛనుదారుడు మల్లిపూడి అలెగ్జాండర్‌కు గురువారం వలంటీరు ఎం.ప్రీతి ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెంచిన రూ. 3వేలు పింఛన్ కాకినాడ ఆస్పత్రికి వచ్చి మరీ వలంటీరు పింఛను అందజేయడంతో పలువురు వలంటీర్లను అభినందించారు.

యోగాతోనే మానసిక ఉల్లాసం



యోగా గురువులను సత్కరిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి ఒక్కరు యోగా చేసేలా ప్రోత్సాహం ఇవ్వాలని, మన ఆరోగ్యం మనమే కాపాడుకోవాలని లయన్స్‌క్లబ్ జిల్లా జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు అన్నారు. పట్టణంలోని నిత్య యోగా శిబిరములను గురువారం సందర్శించి యోగా గురువులు కరిబండి రామకృష్ణ, బడుగు చంద్రశేఖర్‌లను ఘనంగా సన్మానించారు. వక్తలు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని, యోగా, వాకింగ్, వ్యాయామం ప్రతి ఒక్కరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కంచర్ల నరసింహం, దంగేటి ముఖర్జీ, యర్రా ఆంజనేయ స్వామి, కె.సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ కేంద్ర పథకాలు



అత్తిలిలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర సభలో మాట్లాడుతున్న నాయకులు

అత్తిలి: అర్హులైన పేద ప్రజలందరూ కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొవ్వూరి వెంకట రెడ్డి అన్నారు. అత్తిలి మండలం దంతుపల్లి గ్రామంలో గురువారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్యాం ప్రసాద్, ఈఓఆర్డీ శ్రీనివాసరావు, బీజేపీ మండల అధ్యక్షుడు బాలం మహేష్, మండల ప్రధాన కార్యదర్శి కర్రి శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత



బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎంపీటీసీ మార్లపూడి సుబ్బారావు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పుల్లాయగూడెం గ్రామంలో సంభవించిన అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన పెదముత్తి ముసలయ్య కుటుంబానికి ఎంపీటీసీ మార్లపూడి సుబ్బారావు గురువారం నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చీకట్ల పుష్పలక్ష్మికుమారి, చీకట్ల మల్లేశ్వరరావు, వార్డు మెంబర్ అయినిమిల్లి రామకృష్ణ, పి.పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి అవార్డు గ్రహీతకు అభినందనలు



విలియం కేరీ కుటుంబసభ్యులను సన్మానిస్తున్న బిషప్ ఐజక్ ముగ్గళ్ల

పెంటపాడు: రాష్ట్రపతి అవార్డు గ్రహీత మేడిది జాన్‌విలియంకేరీను గురువారం బిషప్ ఐజక్ ముగ్గళ్ల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఐజక్ ముగ్గళ్ల మాట్లాడుతూ మెదడులోని నరాల్లో అసంబద్ధంగా కలిగే చలనాలను గుర్తించే ఎల్రక్టానిక్ పరికరాలను కనుగొనడంతోపాటు 2023 సెప్టెంబర్‌లో చిరుధాన్యాలపై ఉండే ఏడు పొరలను తొలగించే పరికరం కనుగొని న్యూఢిల్లీలో జీ-20 సదస్సులో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జాన్‌విలియంకేరి అవార్డు అందుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను సన్మానించుకున్నట్లు ముగ్గళ్ల చెప్పారు.

‘తాడేపల్లిగూడెం’లో అభివృద్ధి పరుగులు



తాడేపల్లిగూడెం మున్సిపాల్టీ



మెరుస్తున్న సీసీ రోడ్డు

- వైఎస్సార్ సీపీ హయాంలో రూ.300 కోట్ల అభివృద్ధి
- విస్తరించిన రహదారులు,
- ఏర్పడిన మౌలిక వసతులు

తాడేపల్లిగూడెం: చినుకు పడితే చిత్తడి. జారిపడితే ఇత్తడి అన్న రీతిలో ఉండే రహదారులు. గోతులు లెక్కకు మించి, ఆదమరిస్తే ఆర్థోపెడిక్ సేవలు అత్యవసరమే. డ్రెయిన్లు గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అన్న విధంగా ఉండేవి. దుర్గంధాన్ని వ్యాప్తి చెందేలా చేసేవి. దోమల విజృంభణకు మార్గం సుగమం చేసేవి. గత పాలనలో పట్టణ ప్రజలకు పైన చెప్పిన పరిస్థితులు నిత్యకృత్యాలు. వైఎస్సార్ సీపీ పాలనలో దృశ్యం మారింది. ఆహ్లాదకర వాతావరణ చిరునామాలుగా వార్డులు మారాయి. పురానికి అభివృద్ధి వరంగా మారింది. నాలుగన్నరేళ్ల కాలంలో సుమారు 300 కోట్లకు పైగా



పట్టణంలో ఆరోగ్య కేంద్ర భవనాలు

పట్టణ ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాయి. రహదారులు విస్తరించాయి. మౌలికవసతులు కల్పించారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ముందుచూపు, అధికారుల సమన్వయంతో పట్టణ రూపురేఖలు దాదాపుగా మారాయి. వందల కోట్ల రూపాయలతో అభివృద్ధికి అద్దంలా గూడెం మెరిసిపోతుంది.

14వ ఆర్థిక సంఘం నిధులతో ...

14వఆర్థిక సంఘం నిధులతో 2397.98 లక్షలతో



పట్టణంలో కొత్తగా వేసిన తారురోడ్డు

27 వేల మంది ప్రజలకు ప్రయోజనం కలిగేలా సీసీ రోడ్డు, బీటీ రోడ్లు, డ్రెయిన్లు, మంచినీటి సరఫరా, పార్కులు, స్మశానాల అభివృద్ధి చేశారు. 15వ ఆర్థిక సంఘ నిధులు 992.68 లక్షల రూపాయలతో 24వేల మందికి ప్రయోజనం కలిగే విధంగా మొక్కలు నాటడం, పార్కులు అభివృద్ధి పనులకు వెచ్చించారు.

జగనన్న హౌసింగ్ కాలనీల కోసం

జగనన్న హౌసింగ్ కాలనీల కోసం సేకరించిన 61 ఎకరాల్లో వేసిన 11 లే అవుట్లలో 2651 ఇళ్లకు అంతర్గత రహదారులు, స్థలపూడిక కోసం 460-98 లక్షల రూపాయలు వినియోగించారు. గడపగడపకు మన ప్రభుత్వం గ్రాంటుగా ఏడు కోట్లు కేటాయించారు. 35 వార్డుల్లో సీసీరోడ్లు, బీటీ రోడ్లు , డ్రెయిన్ల నిర్మాణం కోసం ఈనిధులను వెచ్చిస్తున్నారు. అమృత్ 2.0 నిధులు 1540 లక్షలతో కొత్తగా ఏర్పాటు చేసిన జగనన్న ఇళ్ల కాలనీలకు మంచినీటి సరఫరా లైన్ల కోసం 28వేల ఇళ్లకు ప్రయోజనం కలిగించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. మనబడి, నాడు-నేడు కింద 17 పాఠశాలల్లో వసతుల కల్పన కోసం 1.41 కోట్లు వినియోగించారు. పనులు ప్రగతిలో ఉన్నాయి. సుమారు రూ.11కోట్లతో 72 పనులను సాధారణ నిధుల నుంచి చేపట్టారు. వార్డు స్ట్రీట్ లైటింగ్, నాడు- నేడు, మంచినీటి సరఫరా, రహదారులు, డ్రెయిన్ల కోసం వినియోగించారు. అర్బన్ హెల్త్ సెంటర్ గ్రాంటుతో అర్బన్ హెల్త్ సెంటర్లు నిర్మించారు.

నేడు కంచుమర్రు, ఆరవల్లిలో కారుమూరి ప్రజాదీవెన పాదయాత్ర

అత్తిలి: గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు శుక్రవారం ఉదయం కంచుమర్రు, మధ్యాహ్నం ఆరవల్లి గ్రామాల్లో ప్రజాదీవెన పాదయాత్రలో పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ చెప్పారు. అనంతరం రాత్రి ఉనికిలి గ్రామంలో మంత్రి బస చేస్తారని తెలిపారు. పాదయాత్ర కార్యక్రమానికి పెద్ద ఎత్తున పార్టీనాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని హౌసింగ్ బోర్డు పరిధిలో మెయిన్ రోడ్డు, రైల్వే, పాతూరు, పీఅండ్‌టీ కాలనీ ఫీడర్ల పరిధిలో ఈ నెల 5వ తేదీ శుక్రవారం విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. పోలీస్‌స్టేషన్, శేషమహల్ సెంటర్, నందిబొమ్మ సెంటర్, మున్సిపల్ ఆఫీస్, జూబ్లీ రోడ్డు, రైల్వేస్టేషన్‌సెంటర్, జాన్సీరాణీ ఆసుపత్రి, వివేకానంద బొమ్మ సెంటర్, రాకెట్ పార్క్, పీ అండ్ టీ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పెంటపాడు: మండలంలోని విద్యుత్ లైన్లు మరమ్మతుల నిమిత్తం శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు నిలిపి వేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ డీఈ వెంకటేశ్వరరావు తెలిపారు. ముదునూరు, రావిగుంట, ముక్కేపురం ఆకుతీగపాడు, ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

సంక్షేమ పథకాలే గెలుపు మార్గాలు

- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు
- 3వ రోజు కొనసాగిన ప్రజా దీవెన పాదయాత్ర

అత్తిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే వచ్చే ఎన్నికల్లో ఘన విజయానికి మార్గాలని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. గురువారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా అత్తిలి మండలం కొమ్మర, ఈడూరు గ్రామాల్లో కారుమూరి ప్రజా దీవెనపాద యాత్ర జరిగింది. పాదయాత్రలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకి ప్రజలు అడుగడుగున ఘన స్వాగతం పలికారు. పాదయాత్ర దారిపొడవునా మహిళలు, వృద్ధులు మంత్రికి హారతులిచ్చి తమ ఆశీస్సులు అందించారు. ప్రతి ఒక్కరిని పలకరిస్తూ ప్రభుత్వం సంక్షేమ పథకాలు వలంటీర్ వ్యవస్థ ద్వారా ఎలా అందుతున్నాయి, ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ అడిగి తెలుసుకున్నారు. స్థానికులు తెలిపిన సమస్యలను ఓపిగ్గా విని, వాటిని సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించి క్యాలండర్ ప్రకారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బటన్‌నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా జమ చేయడంతో తాను ఏగడపకు వెళ్లినా ప్రజలు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో ప్రజలతో మమేకం అయ్యేందుకు ప్రజా దీవెన పేరిట పాదయాత్ర ప్రారంభించానని తెలిపారు. తాను చేపట్టిన ప్రజా దీవెన పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. మన ప్రభుత్వంలో కుల, తమ, పార్టీల కతీతంగా సంక్షేమ ఫలాలు అందాలన్న గొప్ప వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని, దానికి నిదర్శనమే నేడు ఏగడపకు వెళ్లినా ప్రజలు ఆదరిస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలు ఏకమై వచ్చినా వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధిస్తుందన్నారు. బీసీలకు పెద్దపీట వేసిన ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ అని, అన్ని వర్గాల ప్రజలకు మేలు జరగడంతో ప్రజలంతా అండగా ఉన్నారన్నారు. టీడీపీ హయాంలో దోచుకో దాచుకో అనే విధంగా దోచుకున్నారే కానీ ఎటువంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో ఓటీపీ దొంగలు పడ్డారని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఎవరికి తమ ఫోన్ నంబర్‌కు సంబంధించి ఓటీపీలు చెప్పరాదన్నారు. అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, సర్పంచ్‌లు ఎం.రామసీత, ఎం.రామలింగరాజు, వైస్ ఎంపీపీ ఎస్.నాగేశ్వరరావు, పార్టీ నేతలు పి.సత్యనారాయణ, ఎం.అబీబుద్దీన్, జి.ఉమాబాల, కె.శ్రీహరిరాజు, కె.జయరాజు, ఎస్.గణేష్‌రెడ్డి, డి.రామాంజనేయులు, కె.విశాలాక్షి, ఎన్.కనకదుర్గ, నత్తా కృష్ణవేణి, వి.జానకి, ఎం.అన్సారీ పాల్గొన్నారు.



అత్తిలి మండలం కొమ్మరలో మంత్రి కారుమూరికి హారతులిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు



అత్తిలి మండలం ఈడూరులో చిన్నారులతో ముచ్చటిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

జోరుగా.. హుషారుగా..

పలు గ్రామాల్లో ఉత్సాహంగా ఆడుదాం... ఆంధ్ర పోటీలు

పెంటపాడు: మండలంలోని ఆడుదాం ఆంధ్ర పోటీలు జోరుగా, హుషారుగా సాగుతున్నాయి. ఈ పోటీల్లో భాగంగా గురువారం మండలంలో పలు గ్రామాల్లో క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రధానంగా షటిల్, ఖోఖో పోటీలతో పాటు, కబడ్డీ, పోటీలను నిర్వహించారు. యువతతో పాటు, ప్రధానంగా మహిళలు ఉత్సాహభరితంగా ఈపోటీల్లో పాల్గొనేందుకు ముందుకు రావడం విశేషం. పెంటపాడు ఎస్వీవీఎస్ హిందూ హైస్కూల్‌లో షటిల్‌పోటీలు, క్రికెట్, కబడ్డీ, ఖోఖో క్రీడలు జరిగాయి. దర్శిపర్రు, రావిపాడు, గ్రామంలో కబడ్డీ, షటిల్ పోటీలు జరిగాయి. కె. పెంటపాడులో షటిల్ పోటీలు, పెంటపాడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రికెట్ పోటీలు, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎంపీడీవో బాలాజీ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో టీవీ రామకృష్ణ, క్రీడల ఇన్‌చార్జి డి .శేఖర్, పీడీలు సత్తి కన్నారెడ్డి, ఆర్డీ కృపావరం, బి శ్రీనివాస్, ఎస్. దిలీప్, యోహాను, వైశాలి, ఉమామహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



రావిపాడు జెడ్పీస్కూల్‌లో షటిల్ ఆడుతున్న మహిళలు

ఘనంగా బ్రెయిలీ జయంతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక సుబ్బారావుపేటలోని భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. సమగ్ర శిక్ష సహిత విద్య స్టేట్ సహాయ కోఆర్డినేటర్ డాక్టర్ రాధిక, జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్యా కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం, సహాయక కోఆర్డినేటర్ శ్రీనివాస్‌లు హాజరై బ్రెయిలీ చిత్రపటానికి నివాళ్లుర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నత వ్యక్తి బ్రెయిలీ అన్నారు. లూయిస్ బ్రెయిలీ బాల్యతనం, అతని గొప్పతనం, తను కనిపెట్టిన లిపి వంటి అంశాలను విద్యార్థులకు వివరించారు. వివిధ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ కాకర్ల శ్రీను, ఉపాధ్యాయులు కట్టా సురేష్ కుమార్, పాఠశాల హెచ్‌ఎం బి.జ్యోతి, ఎం.చంద్రకుమారి, ఎస్‌కే బాల ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు

అత్తిలి: దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో ఇంటి వద్దకే వలంటీర్లు సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. అత్తిలి మండలం కొమ్మర, ఈడూరు గ్రామాల్లో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాల లబ్ధి వివరాలను అడిగి తెలుసుకొని, అనంతరం బ్రోచర్లను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు సీఎం పెద్దపీట వేశారన్నారు. ప్రతి కుటుంబానికి నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు ఇటీవల జగనన్న ఆరోగ్యసురక్ష వంటి బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టి ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను కూడా అందజేస్తున్నామని తెలిపారు. గ్రామ సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పౌరసేవలు అందిస్తున్న ఈ ప్రభుత్వానికి మీ ఆశీస్సులు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అత్తిలి మండలం ఈడూరులో గడపగడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న మంత్రి కారుమూరి

ఘనంగా సత్యనారాయణ స్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పుంతలో ముసలమ్మ 41వ వార్షికోత్సవ వేడుకలు సందర్భంగా యువఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయం వద్ద గురువారం రాత్రి వైభవంగా సత్యనారాయణ స్వామి కల్యాణం నిర్వహించారు. అమ్మవారికి మేలుకొలుపు, మంగళస్నానం, సుప్రభాత సేవ, విశేష పూజలు జరిగాయి. అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించారు. ఈ కార్యక్రమాలను ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాజా త్రినాథ్, కమిటీ సభ్యులు తదితరులు పర్యవేక్షించారు.

నాలుగేళ్లలో నవోదయం

సచివాలయాల ద్వారా సత్వర పౌరసేవలు

అత్తిలి: ప్రజలకు సత్వర పౌరసేవలు అందించాలనే సంకల్పంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. గురువారం అత్తిలి మండలం కొమ్మర గ్రామంలో రూ.46 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, రూ. 26.30 రైతు భరోసా కేంద్రాన్ని మంత్రి కారుమూరి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్‌ల నిర్మాణానికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాల నుంచి పంట విక్రయం వరకు అన్ని సేవలు పొందవచ్చన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మంచి చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, సర్పంచ్ మంతెన రామసీత, ఉపసర్పంచ్ మన్యందానారావు, సొసైటీ అధ్యక్షుడు కునాధరాజు శ్రీహరిరాజు తదితరులు పాల్గొన్నారు.



కొమ్మరలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

పశువైద్యాధికారులు పనితీరు మెరుగుపర్చుకోవాలి

తాడేపల్లిగూడెం రూరల్: ఆర్బీకేల్లో పనిచేస్తున్న సిబ్బంది మరింత బాధ్యతాయుతంగా పనిచేసేలా పశువైద్యాధికారులు పనితీరు మెరుగుపడాలని పశుసంవర్ధక శాఖ తాడేపల్లిగూడెం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎల్‌కే.సుధాకర్ అన్నారు. మండలంలోని అరుగొలను పశువైద్యశాలను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం మండల పరిషత్ సమావేశంలో లేవనెత్తిన అంశాలపై రికార్డులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం డీడీ సుధాకర్ మాట్లాడుతూ అన్ని సంస్థల్లోనూ హాజరు పట్టీతో పాటు మూమెంట్ రిజిస్టర్లు నిర్వహించాలన్నారు. కృత్రిమ గర్భోత్పత్తి పెంచేలా పశువైద్యులు శ్రద్ధ తీసుకుంటూ స్థానికంగా పశువవిజ్ఞాన బడి జరిగే రోజున పశు గర్భ కోశ వ్యాధుల శిబిరాలు నిర్వహిస్తారని, వాటిని రైతు సోదరులు సద్వినియోగం చేసుకోవడం ద్వారా చూడి శాతం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి.దివ్యశ్రీ ఉన్నారు.



అరుగొలను పశువైద్యశాలను తనిఖీ చేసిన డిప్యూటీ డైరెక్టర్ సుధాకర్

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

భీమవరం అర్బన్: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని శ్రీ రామకృష్ణ మిషన్ పాలకవర్గ సభ్యురాలు గంగవరం శ్రీదేవి అన్నారు. భీమవరం మండలం తుందుర్రు గ్రామంలో శివాలయ ప్రాంగణంలో శ్రీ రామకృష్ణ పరమహంస ధ్యాన మందిర నిర్మాణానికి గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. శ్రీదేవి మాట్లాడుతూ మనిషి రూపంలో ఉన్న భగవంతునికి సేవ చేసుకోవడమేనన్న రామకృష్ణ పరమహంస ఆశయాన్ని, సమాజంలో అందరికి ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టడమే రామకృష్ణ మిషన్ ఉద్దేశమని చెప్పారు. జెడ్పీటీసీ సభ్యుడు కాండ్రేగుల నరసింహరావు, సర్పంచ్ ఆరేటి వీరాస్వామినాయుడు (పెద్దబ్బు)లు మాట్లాడుతూ చీడే సత్యనారాయణ - రమామణిల జ్ఞాపకార్థం వారి కుమారులు 3.75 సెంట్ల స్థలం, రూ.5 లక్షలు విరాళం ఇవ్వడం అభినందనీయమన్నారు.

ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం



ఆర్టీసీ లక్కీ డ్రాలో బహుమతులు అందజేస్తున్న ముప్పిడి సంపత్‌కుమార్

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్ అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో గురువారం లక్కీడిప్ కార్యక్రమం జరిగింది. ఏఎంసీ చైర్మన్ సంపత్ కుమార్ హాజరై మాట్లాడుతూ ఆర్టీసీ ద్వారా సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవచ్చునని తెలిపారు. కార్గోలో సరుకభద్రత ఉంటుందని చెప్పారు. ఆర్టీసీ సేవలను ప్రజలకు వినియోగించుకోవాలన్నారు. అనంతరం భీమవరం, జంగారెడ్డిగూడెం, ఆచంట మార్గాల్లో లక్కీ డ్రా తీశారు. విజేతలైన ప్రయాణీకులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి, పీఆర్‌ఓ విజయ్‌కుమార్, డీఎంఈ మాధవ్, ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణీకులు పాల్గొన్నారు.

235 పాడి పశువులకు టీకాలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని రామన్నగూడెం గ్రామంలో గురువారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తొలుత శిబిరాన్ని సర్పంచ్ చింతా వెంకట్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి డాక్టర్ టి.విజయ్‌కుమార్ 235 పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు.